సాక్షి
మంచిర్యాల
సోమవారం । 29 । ఏప్రిల్ । 2024



పెరిగిన 'మార్కెట్' ఆదాయం

బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ లాభాల పరంపర కొనసాగిస్తోంది. గత రెండేళ్లతో పోలిస్తే ఈసారి అదనపు ఆదాయం ఆర్జించింది. పత్తి క్రయవిక్రయాలు పెరిగాయి. 8లో▸



సమ్మర్ క్యాంపులకు వేళాయె

వేసవి సెలవులు ప్రారంభం కావడంతో విద్యార్థులు క్రీడా శిక్షణ శిబిరాలపై దృష్టి సారించారు. మంచిర్యాలలో క్రికెట్, బాక్సింగ్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో శిక్షణ ఇస్తున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /29.0

ఉదయం వేళ ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



టేకుమట్లలో అదనపు కలెక్టర్ మోతిలాల్

జైపూర్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ తెలిపారు. మండల కేంద్రమైన జైపూర్, గంగిపల్లి, షెట్‌పల్లి, నర్సింగాపూర్, కుందారం టేకుమట్లలో వరి ధా న్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఆయన త నిఖీ చేశారు. నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చా రు. కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా ని ర్వర్తించాలని, ఎప్పటికప్పుడు రైతుల వివరాలు ఆ న్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంత రం టేకుమట్లలో పలు రైస్‌మిల్లులను తనిఖీ చేశా రు. సీఎంఆర్ సకాలంలో అందించాలని, కొనుగో లు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా దించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లులో రికార్డులు పరిశీలించారు.

ప్రవేశ పరీక్ష ప్రశాంతం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తిరుపతి

పాతమంచిర్యాల: మహాత్మాజ్యోతిబా పూలే విద్యాసంస్థల్లో ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాలను మహాత్మాజ్యోతిబాపూలే విద్యాసంస్థల జాయింట్ సెక్రెటరీ తిరుపతి పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎనిమిది ప్రవేశ పరీక్ష కేంద్రాల్లో 1,741మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని మహాత్మా జ్యోతిబా పూలే విద్యాసంస్థల జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. ఇంటర్మీడియెట్‌కు 1,201, డిగ్రీకి 540 మంది హాజరైనట్లు తెలిపారు.

తెలుగు భాష మాధుర్యాన్ని ఆస్వాదిద్దాం



మాట్లాడుతున్న పద్యకవి మలయశ్రీ

మంచిర్యాలఅర్బన్: తెలుగు భాషా అత్యంత మధురమైనదని, ఆ మాధుర్యాన్ని ఆస్వాదిద్దామని పద్యకవి మత్యబోయిన మలయశ్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశుమందిర్‌లో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మలయశ్రీ మాట్లాడుతూ బాల్య దశ నుంచే మన మాతృభాష గొప్పదనాన్ని పిల్లలకు నూరిపోయాలని అన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు కవి తాగానం చేశారు. కార్యక్రమంలో సమితి ప్రధా న కార్యదర్శి శ్రీనివాస్, కవులు సుగుణాకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసివేత

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి రైల్వేగేటు వారం రోజులపాటు మూతపడనుంది. ట్రాక్‌లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 6 గంటల నుంచి వచ్చే నెల 5వరకు రైల్వేగేటును పూర్తిగా మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుని వాహనదారులు సహకరించాలని కోరారు.

ఇక ప్రత్యేక తరగతులు

- మందమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94మంది ఇంటర్ మొదటి సంవత్సరం చదివారు. ఇందులో ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో తొమ్మిది మంది మాత్రమే పాసయ్యారు. 9.57శాతం ఉత్తీర్ణతతో ఫలితాల్లో వెనుకబడిపోయారు.
- దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 109మంది విద్యార్థులు ఉంటే ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారు. 7.34శాతం ఫలితాలు సాధించారు. ఇలా ఫెయిలైన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేయడానికి చర్యలు చేపట్టారు.



మందమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

- నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధత
- 57మంది అధ్యాపకులకు షోకాజ్ నోటీసులు

మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో ఇటీవల అనుత్తీర్ణులైన విద్యార్థులపై ఇంటర్ విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తీర్ణత శాతం మెరగయ్యేలా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాల్, అధ్యాపకులను ఆదేశించారు. ఫలితాల్లో డీలా పడిన ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 29నుంచి మే 20 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిచనున్నారు.

సెక్టార్ కాలేజీల సత్తా..

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సెక్టార్ కాలేజీలు సత్తా చాటాయి. గురుకులాలతో పాటు కేజీబీవీ, మోడల్ కాలేజీలు మెరుగైన ఫలితాలు సాధించాయి. ప్రథమ సంవత్సరంలో సెక్టార్ కాలేజీలు 65.50శాతం ఉత్తీర్ణతతో ముందు వరుసలో నిలిచాయి. ప్రైవేటు కాలేజీలు 43.66శాతం ఉత్తీర్ణతతో వెనుకబడిపోయాయి. ద్వితీయ సంవత్సరంలో కూడా 81.88శాతం ఫలితాలతో సెక్టార్ కాలేజీలు దూసుకెళ్లగా.. ప్రైవేటు కాలేజీలు 48.07 శాతం ఉత్తీర్ణతకే పరిమితం అయ్యాయి.

ఫలితాల్లో డీలా..

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 20ప్రైవేటు కాలేజీలు ఫలితాల్లో పోటీపడి వెనుకబడిపోయాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 145 మంది విద్యార్థులు ఉన్న చోట 25 మంది, 115 మంది ఉన్న చోట 23 మంది, 92 మంది ఉన్న చోట 13 మంది ఇలా ఎక్కడ కూడా 40శాతం మేర ఉత్తీర్ణత సాధించిన కాలేజీలు లేవంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ కాలేజీల మాటిలా ఉన్నా ప్రైవేట్ కాలేజీలు కూడా ఫలితాలు సాధించలేకపోయాయి. వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ నిపుణులైన అధ్యాపకులు అంటూ ప్రచార ఆర్భాటాలు నిర్వహించే ప్రైవేట్ కళాశాలల ఫలితాలు అంతంతగానే వచ్చాయి. మొదటి సంవత్సరంలో ఓ ప్రైవేట్ కాలేజీలో 42 మంది ఉన్న చోట ముగ్గురంటే ముగ్గురు మాత్రమే పాసయ్యారు. 41 మంది చోట ఒక్కరే పాసయ్యారంటే ఒక్కటి రెండు కాలేజీలు మినహా 50శాతం ఫలితాలు సాధించలేకపోయాయి. ద్వితీయ సంవత్సరంలో ప్రైవేట్ కాలేజీల్లో 65 మంది ఉన్నచోట ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 19 మంది విద్యార్థుల్లో నలుగురు పాసయ్యారు. గవర్నమెంట్ కాలేజీలో 137 మందికి 38, 108 మందికి 41 మంది పాస్ కావడం ఫలితాల్లో నిరాశ నింపాయి. కాసిపేట ప్రభుత్వ కాలేజీలో 77 మందికి 62 మంది ఉత్తీర్ణత(80.52) సాధించి ముందు వరుసలో నిలిచాయి.

2024 ఫస్టియర్ ఫలితాలు

కళాశాల	హాజరు	ఉత్తీర్ణులు
ప్రభుత్వ జూనియర్‌కళాశాలలు	1236	258
సెక్టార్ కాలేజీలు	1945	1274
ప్రైవేట్ కాలేజీలు	2274	993
సెకండియర్		
ప్రభుత్వ జూనియర్‌కళాశాలలు	1205	479
సెక్టార్ కాలేజీలు	1727	1402
ప్రైవేట్ కళాశాలలు	3139	1509

భయం తొలగిస్తాం..

ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు ఈ నెల 29నుంచి మే 20వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నాం. అనుత్తీర్ణులైన సబ్జెక్టులపై భయం తొలగించనున్నాం. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు ఉత్తీర్ణత శాతం పడిపోయిన ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలను కూడా ఆదేశించాం. అధ్యాపకులు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలి. ప్రతీరోజు తరగతులు కొనసాగేలా చర్యలు తీసుకుంటాం.

– శైలజ, డీఐఈవో, మంచిర్యాల

57మందికి నోటీసులు

ఇంటర్ ఉత్తీర్ణత శాతం పడిపోవడానికి కారుకులైన అధ్యాపకులకు ఇంటర్మీడియట్ అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. జిల్లాలో పది ప్రభుత్వ కాలేజీల్లో విధులు నిర్వహిస్తున్న 120 మంది అధ్యాపకుల్లో 57 మందికి నోటీసులు జారీ చేశారు. ఆయా సబ్జెక్టుల్లో ఫలితాలు సాధించకపోవడానికి కారణాలేమిటో మూడు రోజుల్లోపు సమాధానాలు ఇవ్వాలంటూ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఒక్క సబ్జెక్టు తప్పిన వారు 504మంది

ఇంటర్ సబ్జెక్టుల వారీగా ఫెయిలైన విద్యార్థుల లెక్కలు తీశారు. ఇందులో 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్‌లో 504 మంది అనుత్తీర్ణులయ్యారు. రెండు సబ్జెక్టులు తప్పిన వారిలో 267 మంది ఉన్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టు లెక్చరర్లను పర్మినెంట్ చేయడం.. రెగ్యులర్ క్లాస్‌లు నిర్వహణతో గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఎక్కువ ఫలితాలు వస్తాయని ఆశించినా వెనుకబడ్డారు.

ఏనుగులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

- ప్రజలు వెంబడించవద్దు
- జాగ్రత్తలపై అధికారుల సమీక్ష



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ ఇక్బాల్ హుస్సేన్

వేమనపల్లి: ఏనుగులు కనిపిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని, ప్రజలు ఏనుగులను వెంబడించడం, సెల్ఫీలు తీసుకోవడం వంటివి చేయవద్దని హెచ్చరించారు. ఏనుగులు పొరుగున ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ప్రాణహిత దాటి వస్తే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయమై ఆదివారం నీల్వాయిలో అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. అటవీ, పోలీసు, రెవెన్యూ వెటర్నరీ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. నీల్వాయి ఎఫ్‌ఆర్‌ఓ ఇక్బాల్ హుస్సేన్ మాట్లాడుతూ ఇరు రాష్ట్రాల సరిహద్దుగా ఉన్న ప్రాణహిత నది అవతలి వైపు ఉన్న సిరోంచ అటవీ డివిజన్ ప్రాణహిత అభయారణ్యంలో ఏనుగుల సంచారం ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. ఎండకాలం కావడంతో నీటి జాడలు, ఆహారం నిల్వలు సంవృద్ధిగా లేవని, ఏనుగులు ఆకలిని తీర్చుకునేందుకు తీరం వెంట ఉన్న నది దాటి మంచిర్యాల జిల్లా నీల్వాయి, కోటపల్లి, కుశ్నపల్లి అటవీ రేంజ్‌లలోకి ప్రవేశించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారుల సమన్వయంతో ఏనుగులను నిలువరించడం, సంరక్షించడం సాధ్యమని తెలిపారు. ఏనుగు సంచారంతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టాలు కలుగకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అటవీ సిబ్బంది డ్రోన్ కెమెరాలతో ట్రాకింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రమేష్, పశువైద్యాధికారి అరుణ, ఎస్సై శ్యాంపటేల్, పంచాయతీ కార్యదర్శులు, అటవీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహారం విషతుల్యం!



కల్తీ నూనెలో కాగుతున్న బజ్జీలు

- హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై నిఘా కరువు
- పట్టించుకోని అధికారులు

మంచిర్యాలక్రైం: కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి సరదాగా పేరున్న హోటల్, రెస్టారెంట్లకు వెళ్లినప్పుడు ఆర్డర్ చేయగానే వేడి వేడి ఆహార పదార్థాలు వడ్డిస్తారు.. కానీ అవి ఆ రోజు వండినవేనా..? ముందు రోజు మిగిలినవి ఫ్రిడ్జ్‌లో ఉంచి వేడి చేసి వడ్డిస్తున్నారా..? అనే సందేహం తలెత్తితే సమాధానం చెప్పేవారు ఉండరు. ఇక బిర్యానీ, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆకర్శణీయమైన రంగుతో తినుబండారాలు కనిపిస్తుంటాయి. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరుస దాడులు నిర్వహించి జిల్లా కేంద్రంలోని మంచిర్యాలలో పది రెస్టారెంట్లపై కేసులు నమోదు చేశారు. జరిమానాలు విధించి హోటళ్ల గుట్టు రట్టు చేశారు. తాజాగా జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ హోటల్ నుంచి ఓ వ్యక్తి ఉప్మ పార్సిల్ చేయించుకున్నాడు. ఇంటికి వెళ్లి కవర్ తెరిచి చూడగా అందులో ఎలుక కనిపించింది. వెంటనే సదరు వ్యక్తి హోటల్ యజమానికి చూపిస్తూ గొడవ పడిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. దీంతో సదరు హోటల్ యజమాని ఈ వీడియో ఇప్పటిది కాదని, పది నెలల క్రితంది అంటూ తమ తప్పును ఒప్పుకోకనే ఒప్పుకున్నాడు. కనీసం ఈ విషయంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు సమాచారం అందించేందుకు ఫోన్ చేస్తే స్పందించకపోవడం గమనార్హం.



ఉప్మ పార్సిల్‌లో చనిపోయిన ఎలుక(ఫైల్)

పెరిగిన హోటళ్లు

జిల్లాలో హోటళ్ల సంస్కృతి పెరుగుతోంది. ఉద్యోగులు మొదలుకుని రోజువారీ కూలీల వరకు వివిధ పనులపై బయటకు వెళ్లినప్పుడు అవసరాన్ని బట్టి టిఫిన్, భోజనం, సరదాగా గరం గరం మిర్చి, ఫాస్ట్‌ఫుడ్, రెస్టారెంట్లను ఆశ్రయిస్తుంటారు. ఇందులో ఫాస్ట్‌ఫుడ్ తినేవారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు రద్దీగా కనిపిస్తున్నాయి. పెరిగిన నిత్యావసర సరుకుల ధరల కారణంగా ఫాస్ట్‌ఫుడ్, హోటల్స్ యజమానులు కల్తీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఆహార పదార్థాలు రుచిగా ఉండేందుకు టెస్టింగ్‌సాల్ట్, కొన్ని కంపెనీలకు చెందిన రెడీమేడ్ మసాలాలు, వివిధ రకాల రసాయనాలు వినియోగిస్తున్నారు. చాలాచోట్ల నాణ్యతాప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా రంగురంగుల రసాయనాలు కలుపుతూ క్యాన్సర్, గుండె జబ్బుల వంటి ప్రాణాంతకమైన రోగాలకు కారణమవుతున్నారు. జిల్లాలో కొందరు ట్రేడ్, ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ లేకుండానే హోటళ్లను యథేచ్ఛగా నడిపిస్తున్నారు. మరికొందరు మాంసం, చికెన్ విక్రయాలు చేసే వారితో బేరం కుదుర్చుకుని అనా రోగ్యంతో ఉన్న మేకలు, గొర్రెలు, గాయాలైన వాటిని తక్కువ ధరకు తీసుకొచ్చి వాటి మాంసంతో వంటకాలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. తక్కువ ధరకు వచ్చే నూనెలు, మసాలా దినుసులు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసి వంటలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో కల్తీ ఆహారం, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నియమ నిబంధనలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసును సంప్రదించగా.. స్పందించలేదు.

జాడలేని కల్తీ నిరోధక శాఖ అధికారులు

జిల్లా కేంద్రంలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. హోల్‌సేల్ కిరాణం మర్చంట్ అండ్ ట్రేడర్స్‌లో అల్లంవెల్లుల్లి పేస్ట్, పసుపు, కారంపొడి, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల జీరో దందా సాగిస్తూ కల్తీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేపట్టి ర్యాండమ్‌గా నమూనాలు తీయాలి. నిత్యావసర వస్తువులు పాలు మొదలుకుని టీ పొడి వరకు ఇలా ప్రతీ ఒక్కదానిపై నాణ్యత ప్రమాణాలు పరిశీలించడం, తనిఖీలు నిర్వహించాలి. నెలకు కనీసం 12నమూనాలు తీసి ఎస్ఎఫ్ఎల్(ఫుడ్ సేఫ్టీ ల్యాబొరేటరీ)కి పంపించాల్సి ఉంటుంది. అక్కడి నుంచి వచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఇలాంటి చర్యలు ఇప్పటివరకు కనిపించిన దాఖలాలు లేకపోవడం కల్తీ నిరోధక శాఖ అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తోంది.

సీనియర్లకు ప్రాధాన్యత తగ్గదు

- ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి
- కాంగ్రెస్ పార్టీలో చేరికలు..



మాట్లాడుతున్న రోహిత్ చౌదరి, ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: కాంగ్రెస్ పార్టీ బలోపేతం లక్ష్యంగా కొత్తగా చేరికలు సాగుతున్నాయని, ఇతర పార్టీల నుంచి చేరుతున్న నాయకుల వల్ల పార్టీలోని సీనియర్లకు ప్రాధాన్యత ఏమాత్రం తగ్గదని ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి అన్నారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లౌకికవాదానికి కట్టుబడి పని చేస్తున్న వారు ఎవరైనా కాంగ్రెస్ పార్టీలో చేరవచ్చని, ప్రజాస్వామ్యయుతంగా పార్టీలో చేర్చుకుంటామని అన్నారు. పాత, కొత్త నాయకులు కలిసికట్టుగా పని చేయాలని తెలిపారు. దేశమంతటా కాంగ్రెస్ అనుకూల పవనాలు వీస్తున్నాయని, అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, నాయకులు ప్రభాకర్, జయరాంయాదవ్, దావ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో..

భీమిని: కన్నెపల్లి మండలం జన్కాపూర్ గ్రామ పంచాయతీలోని ఎంపీపీ నివాసంలో ఆదివారం భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులతోపాటు సుమారు 800 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. కన్నెపల్లి ఎంపీపీ మాధవరపు నృజనసర్సింగరావు, భీమిని, కన్నెపల్లి మండలాల పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు ఆధ్వర్యంలో చేరారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు మార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భీమిని మాజీ వైస్ ఎంపీపీ గడ్డం మహేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు ఎల్లాగౌడ్, బల్గం సంతోష్, ఇందూరి భూమయ్య, ఎంపీటీసీ కర్ణ మమత, మాజీ సర్పంచ్‌లు కవిత, సుంకరి తిరుపతి, సీనియర్ నాయకులు పుల్లూరి శేఖర్, విఘ్నేష్, కొమురయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

'అటవీశాఖ ఆంక్షలు ఎత్తివేసే వరకు ఉద్యమం'



రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లో వాహనాల రాకపోకలపై అటవీ శాఖ ఆంక్షలు ఎత్తివేసే వరకు దశల వారీగా ఉద్యమించాలని పలువురు నాయకులు నిర్ణయించారు. ఆదివారం మండల కేంద్రంలోని వైశ్య భవన్‌లో సామాజిక పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు సామాజిక వేత్తలు, వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా ఇతర ప్రాంతాలకు భారీ వాహనాల రాకపోకలను అటవీశాఖ అధికారులు నిషేధించారని, దీంతో జన్నారం మండలం అభివృద్ధిలో, వ్యాపార పరంగా వెనుకబడిపోతోందని తెలిపారు. మండలానికి వచ్చే సరుకుల వాహనాలు జగిత్యాల మీదుగా రావడం వల్ల రవాణా వ్యయం పెరిగి నష్టాలపాలు కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట నుంచి జన్నారం మీదుగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు వెళ్లే వాహనాలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ నెల 29 నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు సామాజిక పోరాట సమితి కన్వీనర్ శ్రీరాముల భూమాచారి తెలిపారు. దండేపల్లి, జన్నారం, ఉట్నూర్, కడెం మండలాల ప్రజలు తాము చేపట్టే పోరాటాలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సామాజిక పోరాట సమితి నాయకులు ఓంకారేశ్వర్, షేక్ అక్బర్, సీపీఐ మండల కన్వీనర్ మామిడి విజయ్, మహేశ్, సుధనాలాల్ నాయక్, వ్యాపారవేత్తలు వామన్, అంజన్న, పరుశురాం, దయాకర్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

- పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- దండేపల్లిలో బీఆర్ఎస్ ప్రచార సభ



మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

దండేపల్లి: అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. దండేపల్లిలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి ఆదివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి ఐదు నెలలు గడిచినా ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు. సాధ్యం కానీ హామీలు గుప్పించి ప్రజలను మోసం చేశారని అన్నారు. సాగునీటి రంగానికి పెద్దపీట వేసిన మాజీ సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణంతో తెలంగాణను సస్యశ్యామలం చేశారని, ఆసరా పింఛన్లు పెంచిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కారుగుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నడిపెల్లి ట్రస్టు చైర్మన్ విజిత్‌రావు, వైస్‌ఎంపీపీ అనిల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్, మాజీ ఉపసర్పంచ్ భూమన్న, నాయకులు రాజమల్లు, సంతోష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీపై కాంగ్రెస్, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

- ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్
- బీసీ సామాజిక సమ్మేళనం



మాట్లాడుతున్న సోగాల కుమార్

పాతమంచిర్యాల: బీజేపీ రాజ్యాంగం మారుస్తుందని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, ఆ పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగాల కుమార్, బీజేపీ పెద్దపల్లి అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీసీ సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ప్రధానమంత్రిని చేసిన ఘనత బీజేపీదేనని అన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మందికి స్థానం కల్పించిన ఘనత కూడా బీజేపీకే దక్కుతుందని తెలిపారు. బీసీ సామాజిక వర్గాల్లోని చేతివృత్తుల వారికి విశ్వకర్మ యోజన ద్వారా రూ.3 లక్షల రుణ సహాయం అందించి అండగా నిలిచిందని అన్నారు. అంబేద్కర్‌ను అవమానించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీజేపీ రాజ్యాంగం మారుస్తుందని దుష్ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజయ్, రాష్ట్ర కార్యదర్శి రజనీష్‌జైన్, సంజయ్, నాయకులు దుర్గం అశోక్, పెద్దపల్లి పురుషోత్తం, బొద్దున మల్లేష్, మోటపలుకుల తిరుపతి, కొండపాక చారి, సుధీర్‌గౌడ్, కర్ణ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీల పేరిట మోసం'



ఎన్నికల ప్రచారంలో రఘునాథ్, కార్యకర్తలు

దండేపల్లి: ఆరు గ్యారంటీల పేరుతో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆరోపించారు. మండలంలోని పెద్దపేట, లక్ష్మీకాంతపూర్, బిక్కనగూడ గ్రామాల్లో పెద్దపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌కు మద్దతుగా ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు చెల్లిస్తామని చెప్పి ఏదీ చేయలేదన్నారు. మోదీ హయాంలోనే రైతులకు అనేక సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, రైతుసమితి మాజీ జిల్లా కన్వీనర్ మోటపల్కుల గురువయ్య, నాయకులు రవిగౌడ్, లక్ష్మీనారాయణ, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ నాయకురాలు పద్మారెడ్డి మృతి


పద్మారెడ్డి (ఫైల్)

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకురాలు తోడే పద్మారెడ్డి (52) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పద్మారెడ్డి మంచిర్యాలలో నివాసం ఉంటున్నారు. నాలుగు రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని శనివారం రాత్రి ఇంటికి వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, కాంగ్రెస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించారు. ఆమె 2000 సంవత్సరం నుంచి 2010 వరకు సీడీఎస్ జిల్లా అధ్యక్షురాలికి పని చేశారు.

మద్యానికి బానిసై కూలీ మృతి

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని ఓ ఇటుకబట్టీలో పనిచేసే కూలీ సురేందర్ సింగ్ (54) మద్యానికి బానిసై మృతి చెందాడు. ఒరిస్సా నుండి ఇక్కడికి వచ్చి కూలీ పనిచేస్తున్న సురేందర్ ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. రెండ్రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. కాగా కుటుంబ సభ్యులు శనివారం ఆసుపత్రి నుండి తమ సొంత ఊరికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

వడదెబ్బతో ఒకరు మృతి

జన్నారం: మండలంలోని పొనకల్‌లో వడదెబ్బతో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై మృత్యుంజయ సర్కార్, మృతుని సోదరుడు సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేడిశెట్టి మహేశ్ (40) ఆదివారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. తిరిగివస్తుండగా అస్వస్థతకు గురికావడంతో సమీపంలోని డ్రెయినేజీలో పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. సురేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి ఒకరు..

లక్సెట్టిపేట: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. మధ్యప్రదేశ్‌కు చెందిన పడిలాల్‌దాస్ కొమ్రె (31) ఐదు రోజుల క్రితం మరో నలుగురు మిత్రులతో కలిసి మండలంలోని కొత్తురుకు వలస వచ్చి మామిడికాయల మండిలో పనిచేస్తున్నారు. ఒక్కరోజు మాత్రమే పనిచేసి నేను ఇంటికి వెళ్తానని పడిలాల్ దాస్ స్నేహితులతో చెప్పి వెళ్లిపోయాడు. ఆదివారం కొత్తురు గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శవమై కనిపించాడు. గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు తరచూ మద్యం సేవించేవాడని, మద్యం మత్తులో బావిలో పడిపోయి ఉంటాడని మిగతా స్నేహితులు తెలిపారు. మృతుని బావమరిది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పెరిగిన 'మార్కెట్' ఆదాయం

- ఈ ఏడాది అదనపు ఆదాయం

వ్యవసాయ మార్కెట్‌కు నిర్దేశించిన లక్ష్యాలు

సంవత్సరం	టార్గెట్	సాధించింది (రూ.లక్షల్లో)
2021–22	253.57	262.77
2022–23	261.10	224.88
2023–24	259.24	360.43



బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

బెల్లంపల్లి: బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ లాభాల పరంపరను కొనసాగిస్తోంది. గడిచిన రెండేళ్లతో పోలిస్తే ఈసారి అదనపు ఆదాయం ఆర్జించింది. పత్తి క్రయ విక్రయాలు పెరగడం, ఆర్థిక సంవత్సరం ముగింపుకాలానికి ముందస్తుగా కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చెల్లింపులు జమ చేయడం, పాత బకాయిలు వసూలు కావడం వల్ల వ్యవసాయ మార్కెట్ ఆదాయం వృద్ధి చెందింది. మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్యాన్ని మించి బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ ప్రత్యేకతను చాటుకుంటోంది.

చెల్లింపులు జరిగి...

బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఏటా కనిష్టంగా రూ.220 లక్షల నుంచి గరిష్టంగా రూ.240 లక్షల వరకు ఆదాయం వస్తుంది. అయితే ఈసారి గతానికి భిన్నంగా ఎక్కువ ఆదాయం వచ్చింది. గతేడాది ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు పత్తి కొనుగోలు చేయగా ఈసారి సీసీఐ చేపట్టింది. ఆ కొనుగోలు తాలూకు మార్కెట్ ఫీజును ఆర్థిక సంవత్సరం ముగిసిన తర్వాత మార్కెట్ యార్డుకు జమ చేయడం ఆనవాయితీగా వస్తుండగా ఈ దఫా మార్చి 31లోపే చెల్లింపులు జరిగాయి. ఏకంగా రూ.1.24 కోట్లు మార్కెట్ ఖాతాలో సీసీఐ జమ చేసింది. పాత బకాయిలు రూ.20 లక్షలు వసూలు అయ్యాయి. దీంతో ఏటా వచ్చే రూ.220 లక్షల ఆదాయానికి తోడు ఈ ఏడాది రూ.1.24 కోట్లు అదనంగా ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

పెరిగిన పత్తి విక్రయాలు..

వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గతేడాదితో పోలిస్తే ఈసారి పత్తి విక్రయాలు పెరిగాయి. బెల్లంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా 90 వేల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో తెల్లబంగారం సాగైంది. ప్రకృతి సహకరించడంతో కాలం కలిసి వచ్చింది. దీంతో పంట దిగుబడి కూడా పెరిగింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ కమిటీ పరిధిలో 2 లక్షల క్వింటాళ్ల పత్తి క్రయ విక్రయాలు జరగగా, ఈసారి 2.20 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి అమ్మకాలు జరిగినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. పత్తి క్రయ విక్రయాలు పెరగడంతో మార్కెట్ ఆదాయం కూడా పెరిగింది.

ప్రైవేట్ కొనుగోళ్లు తగ్గడంతో..

ఈసారి మద్దతు ధర దక్కడంతో రైతులు చాలా వరకు సీసీఐ ద్వారానే పత్తి విక్రయించారు. ప్రైవేట్ కొనుగోళ్లు తగ్గాయి. పత్తి కొనుగోళ్లు పెరిగడంతో ఆదాయం వృద్ధి చెందింది. ఆర్థిక సంవత్సరం ముగింపులోగానే సీసీఐ మార్కెట్ ఫీజు చెల్లించింది. పాత బకాయిలు కూడా వసూలు కావడంతో మార్కెట్‌కు అదనంగా ఆదాయం సమకూరింది.

– భాస్కర్, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి కార్యదర్శి, బెల్లంపల్లి

ఆయిల్‌పాం సాగులో జాగ్రత్తలు


లంబడిపల్లిలో సాగవుతున్న ఆయిల్‌పాం

- వేసవిలో ప్రతీరోజు మొక్కలకు నీరందించాలి
- చీడపీడలు సోకిన ఆకులు తొలగించాలి


ఆర్.తిరుపతి, హెచ్ఈవో

చెన్నూర్‌రూరల్: జిల్లాలో గత నాలుగేళ్లుగా పలువురు రైతులు ఆయిల్‌పాం సాగు చేస్తున్నారు. రైతులు తమ భూముల్లో వీటి మొక్కలను పెంచుతున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 794 మంది 2,795 ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు. వేసవిలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ఆయిల్‌పాం మొక్కలు దెబ్బతినే అవకాశం ఉంది. పంట సాగులో రైతులు అధిక దిగుబడి పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉద్యానవనశాఖ అధికారి తిరుపతి వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఒకటి నుంచి మూడేళ్ల వయస్సు ఉన్న ఆయిల్‌పాం తోటల్లో మొక్కకు మూడు అడుగుల దూరంలో జ నుమును పచ్చిరొట్ట ఎరువుగా నాటుకోవాలి. జను ము పూతకు వచ్చిన వెంటనే చిన్న, చిన్న ముక్కలుగా కోసి పాదులో చుట్టూ వేయాలి. ప్రతీ ఆయిల్‌పాం మొక్కకు ఇరువైపులా మైక్రోజెట్ అమర్చుకోవాలి. వేసవిలో చిన్న మొక్కలకు ప్రతీరోజు 150 నుంచి 160 లీటర్ల నీటిని అందించాలి. ఎదిగిన మొక్కకు ప్రతీ రోజు 250 నుంచి 330 లీటర్ల నీటిని అందించాలి. మూడేళ్ల లోపు వయస్సు ఉన్న మొక్కల్లోని పూగుత్తులను ప్రతినెలా తొలగించాలి. అవసరం మేరకు మాత్రమే ఎండిన, విరిగిన, చీడపీడలు సోకిన ఆకులను తొలగించాలి. చెలువు లేదా వృథాగా వచ్చిన ఆకులను తొ లగించవద్దు. అలాగే ఎదిగి న ఆయిల్‌పాం తోటల్లో గెలలు కోసిన తర్వాత నరికి ముక్కలు చేసిన ఆకులు, మగ పూలగుత్తులు, మొక్కజొన్న చొప్పను, ఖాళీ ఆయిల్‌పాం గెలలను పాదులలో మల్చింగ్‌గా పరవాలి. పక్వానికి వచ్చిన ప్రతి గెలను అల్యూమినీయం కడ్డీని లేదా కత్తిని ఉపయోగించి కోయాలి. ఎదిగిన తోటలకు నెలకు 5 కిలోల యూరియాను, 3 కిలోల డీఏపీ, 5 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 2.5 కేజీల మెగ్నీషియం సల్ఫేట్‌ను కేజీ బోరాక్స్‌ను విడివిడిగా నీటిలో కరిగించి ఫెర్టిగేషన్ ద్వారా మొక్కలకు అందించాలి. తోటల్లో ఎక్కువగా పోషకలోపాలు కనిపించినట్లయితే మట్టిపత్ర విశ్లేషణ కోసం సిఫారసు చేసినట్లు సేకరించి పంపించాలి. ఇలాంటి జాగ్రత్తలు తీసుకుంటే ఎండల బారి నుంచి మొక్కలను కాపాడుకోవచ్చు. అధిక దిగుబడులు పొందవచ్చు.

ఏఐటీయూసీ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో ఆదివారం ఏఐటీయూసీ శ్రేణులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హాజరై కార్మికుల హక్కులు, సంస్థ స్థితిగతులపై వివరించారు. రిటైర్డ్ డీజీఎం శ్యాం సుందర్ మాట్లాడుతూ సింగరేణిలో కొద్ది కాలం ఉద్యోగం చేసి రిటైర్డ్ అయిన వారికి సంబంధించిన టెర్మినల్ బెనిఫిట్స్, మైనింగ్ రూల్స్, స్టాడింగ్ ఆర్డర్, తదితర వివరాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ తిరుపతి మాట్లాడుతూ లౌకిక వాదం, మతోన్మాదం దేశంలో అమలవుతున్న హిందుత్వ ఏజెండాపై కులంకశంగా వివరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ మేడే విశిష్టత, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్లు, నాయకత్వం లక్షణాలు, కార్మిక చట్టాలు, తదితర విషయాలపై వివరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ మాట్లాడుతూ మార్క్సిస్టు యొక్క మూల సూత్రాలను తెలియజేశారు. ఏఐటీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు భీమనాథుని సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, కార్యక్రమ ప్రిన్సిపల్ అక్బర్ అలీ, మందమర్రి, బెల్లంపల్లి, రామకృష్ణాపూర్ ఏరియా కార్యదర్శులు సత్యనారాయణ, దాగం మల్లేశ్, ఆంజనేయులు, గుండ మల్లేశ్, ఏరియాలోని అన్ని గనులు, డిపార్ట్‌మెంట్ల పిట్ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

'ఓసీపీల్లో షిఫ్ట్ వేళలు మార్చాలి'

శ్రీరాంపూర్: ఎండ తీవ్రత దృష్ట్యా ఓపెన్ కాస్టు గనుల్లో షిఫ్ట్‌వేళలు మార్చాలని టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి యాజమాన్యానికి లేఖ రాసినట్లు ఆయూనియన్ నాయకులు పెట్టం లక్ష్మణ్, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేశ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కోరోజు 50 డిగ్రీల ఉష్ణోగ్రత కూడా నమోదవుతుందని, ఈ వేడిలో ఉద్యోగులు పనిచేయడం ఇబ్బందిగా ఉందన్నారు. క్వారీల్లో మరిన్ని చలువ పందిళ్లు వేయించాలని, ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు కూడా పంపిణీ చేయాలని కోరారు.

ఏటీఆర్ ఎఫ్‌డీపీటీ పర్యటన


మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు ఎఫ్‌డీపీటీ క్షితిజా ఆదివారం రెబ్బెన మండలంలో పర్యటించారు. తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై వన్యప్రాణుల కోసం నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జిని పరిశీలించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో వన్యప్రాణులకు కలిగే ఉపయోగాలను స్థానిక అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రెబ్బెన, బెల్లంపల్లి రేంజ్‌ల సరిహద్దు ప్రాంతంగా ఉన్న తక్కళ్లపల్లి బస్టాండ్ సమీపంలోని అటవీ ప్రాంతం గుండా వన్యప్రాణులు రోడ్డు దాటే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ సమయంలో జాతీయ రహదారిపై నడిచే వాహనాల కారణంగా వన్యప్రాణులకు ఎలాంటి హాని జరగకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. వాహనాలు వంతెన పైనుంచి వెళ్తే.. కింది నుంచి జంతువులు సంచరించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం రేంజ్ పరిధిలోని ధర్మారం ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ప్లాంటేషన్ నిర్మాణం, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రీధరాచారి, సెక్షన్ ఆఫీసర్ సతీష్, బీట్ అధికారులు భుక్య రవి, మమత ఉన్నారు.

సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు చేయాలి



అభివాదం చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు చేయాలని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు కే.లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో కేంద్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు గనులను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. సింగరేణి వాస్తవ లాభాల నుంచి 40 శాతం వాటాను జూన్ నెలలోనే కార్మికులకు పంపిణీ చేయాలని, గనుల్లో కొత్త టెక్నాలజీ తీసుకువచ్చి వెంటిలేషన్ మెరుగుపర్చాలని, సొంతింటి పథకం అమలు చేయాలని, ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వాలని, కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇతర యూనియన్లకు చెందిన పలువురు బీఎంఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, నాయకులు మాధవ నాయక్, పవన్ కుమార్, మండల క్రాంతి, వేణుగోపాల రావు, సారంగపాణి, శ్రీనివాసరాజు, మోహన్ రెడ్డి, నాతాడి శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాగయ్య కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న రోహిత్ చౌదరి

బెల్లంపల్లి: ఇటీవల మృతి చెందిన బెల్లంపల్లికి చెందిన ఉమ్మడి రాష్ట్ర పీసీసీ మాజీ వైస్ ప్రెసిడెంట్ తాటి పాముల నాగయ్య కుటుంబాన్ని ఆదివారం ఏఐసీసీ సెక్రెటరీ రోహిత్ చౌదరి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఓ సీనియర్ నాయకుడిని కోల్పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మత్తమారి సూరిబాబు, నాయకులు నాతరి స్వామి, రాజలింగు, జయరాం పాల్గొన్నారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మరావుపేట లంబాడితండాలో శనివారం రాత్రి నిద్రిస్తున్న మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరించిన సంఘటన చోటు చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సత్తవ్వ అనే మహిళ ఇంటిముందు వరండాలో నిద్రిస్తుండగా ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కెళ్లినట్లు తెలిపాడు. తులంనర (1.5 గ్రాములు) ఉంటుందని తెలిపారు. సంఘటన స్థలాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను తెప్పించి విచారణ జరుపుతున్నారు.

ప్రాణత్యాగాలతోనే హక్కులు సాధించుకున్నాం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్


అభివాదం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగానే నేడు కార్మికులు హక్కులు సాధించుకున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ తెలిపారు. ఆదివారం నస్పూర్ కాలనీలోని సేవాభవన్ వద్ద మేడే సందర్భంగా ఏఐటీయూసీ సభ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు 138వ మేడే వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. నాటి పోరాట స్ఫూర్తితో నేడు కార్మికులు తమకు ఉన్న హక్కులను రక్షించుకోవాలన్నారు. సింగరేణిలో ఎంతోమంది ఏఐటీయూసీ నేతలు కార్మికుల హక్కుల సాధన కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసారన్నారు. సింగరేణిలో ఉద్యమ, పోరాట చరిత్ర ఉన్న ఏకైక సంఘం ఏఐటీయూసీనే అన్నారు. అనంతరం సింగరేణి విభాగం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ అలవెన్సులపై ఆదాయ పన్ను మాఫీ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు సాబీర్‌పాషా, కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, అక్బర్ అలీ, కిషన్ రావు, కొమురయ్య, మేకల దాసు, చంద్రశేఖర్, అఫ్రోజ్‌ఖాన్, జోగుల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

దండేపల్లి: మండలంలోని గూడెం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ టీం సభ్యులు, పోలీసులు శనివారం రాత్రి నిర్వహించిన తని ఖీల్లో నగదు పట్టుకున్నారు. రాయపట్నం నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.1,30,500 నగదు లభించిందని, వీటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై లింగంపెల్లి భూమేష్ తెలి పారు. తనిఖీల్లో టీం ఇన్‌చార్జి విజయ్‌ప్రసాద్, ఏఎస్సై రాజేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికను మోసగించిన యువకుని రిమాండ్

చెన్నూర్: బాలికను మోసగించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్ తెలిపారు. కోటపల్లి మండలం సుపాక గ్రామానికి చెందిన బాలిక అదే మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన గడ్డం వెంకటేశ్ రెండేళ్లుగా ప్రేమించుకున్నారు. యువకుడు బతుకుదెరువు కోసం వచ్చి చెన్నూర్ పట్టణంలోని గెర్రె కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఐదు నెలల క్రితం బాలికను వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి చెన్నూర్ పట్టణంలోని గెర్రె కాలనీలో సహజీవనం చేశారు. ఆదివారం వివాహం చేసుకోమని అడిగితే నిరాకరించి ఇంటి నుంచి పంపించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటో కార్మికులకు జీవనభృతి ఇప్పించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: ఆటో కార్మికులకు జీవనభృతి ఇప్పించాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలోని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నివాసంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి పొట్ట మధుకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఆటో కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయి, కుటుంబ పోషణకు నానా అవస్థలు పడుతున్నామన్నారు. నెలకు రూ.12 వేలు జీవనభృతి చెల్లించాలని, ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పికి గాయాలు


చుక్కల దుప్పికి చికిత్స చేస్తున్న స్థానికులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి వనంలో గల జింకల పార్కులో ఆదివారం ఉదయం కుక్కల దాడి చేయగా ఓ చుక్కల దుప్పికి గాయాలయ్యాయి. పార్కులోపలికి వెళ్లిన కుక్కలు దుప్పి వెంట పడటంతో గాయాలపాలైన దుప్పి పార్కు నుండి బయటకు వచ్చింది. గమనించిన స్థానికులు గోపాలమిత్ర సూపర్‌వైజర్ ఆకుతోటి రవి సహాయంతో ప్రాథమిక చికిత్స అందించారు. జింకల పార్కులోకి కుక్కలు వెళ్లకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటర్ ఫెయిలయ్యానని విద్యార్థి ఆత్మహత్య


కార్తికేయ (ఫైల్)

శ్రీరాంపూర్: ఇంటర్ ఫెయిలయ్యానని మనస్తాపం చెందిన పులి కార్తికేయ(18) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సంతోష్ తెలిపారు. శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్కే 6 గాంధీనగర్‌కు చెందిన పులి మల్లయ్య, దేవలత దంపతుల రెండో కుమారుడు కార్తికేయ గతేడాదే ఇంటర్ పూర్తి చేయాల్సి ఉంది. కానీ కొన్ని సబ్జెక్టులు పాస్ కాలేదు. దీంతో ఈ ఏడాది మళ్లీ పరీక్షలు రాసాడు. మళ్లీ ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందాడు. శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పుకు చున్నీతో ఉరేసుకున్నాడు. బయటకు వెళ్లిన తల్లి ఇంటికి వచ్చి పిలువగా ఎంతకూ తలుపు తీయకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు తెరవగా ఉరేసుకుని కనిపించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య


సాయికిషోర్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారులో రైలు కింద పడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. స్థానిక కాలేజ్ రోడ్‌కు చెందిన పాట్యాల సాయికిషోర్ (35) తండ్రి ఏడాదిక్రితం గుండెపోటుతో మృతి చెందాడు. అప్పటి నుంచి మనస్తాపానికి గురై ఏపనీ చేయకుండా ఖాళీగానే తిరుగుతున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కీర్తన, కుమారుడు ఉన్నారు. కీర్తన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత


బాధితురాలికి ఫోన్ అప్పగిస్తున్న పోలీసులు

భీమారం: ఓ యువతి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ఆదివారం బాధితురాలికి అప్పగించినట్లు ఎస్సై బి.రాములు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బండారి సుమతి ఈ నెల 27న వివాహ వేడుకల్లో సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఆర్ఐ యాప్ ద్వారా ఫోన్ ఆచూకీ కనుక్కున్న పోలీసులు స్వాధీనం చేసుకుని యువతికి అప్పగించారు.

పోలీసు కస్టడీకి నిందితుడు

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పాశిగాం శివారులోని భీంరావు బాబా ఆశ్రమంలో బాలుడి డెత్ మిస్టరీ కేసులో అరెస్టయి జైలులో ఉన్న భీంరావును విచారణ నిమిత్తం ఆదివారం రెబ్బెన పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. రెండు రోజుల పోలీస్ కస్టడీకి తీసుకోగా మొదటి రోజు ఆదివారం కేసు విచారణలో భాగంగా రెబ్బెన సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్ నిందితుడిని వెంట తీసుకుని ఆశ్రమానికి వెళ్లి అక్కడ నాటు వైద్యం కోసం వివిధ రకాల మూలికలతో తయారు చేసిన నూనెలతో పాటు పూజా సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కేసుకు సంబంధించి కొన్ని ఆధారాలు సేకరించామని, సోమవారం నిందితుడిని తిరిగి కోర్టులో హాజరుపర్చనున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

న్యాయవాదులు మానసికంగా ధృడంగా ఉండాలి

మంచిర్యాలక్రైం: న్యాయవాదులు మానసికంగా ధృడంగా ఉండాలని యోగా మాస్టర్స్ పద్మవతి, కళ్యాణ్ అన్నారు. మూడు రోజులుగా జిల్లా కేంద్రంలోని న్యాయవాదులకు నిర్వహిస్తున్న హార్ట్ ఫుల్ ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా యోగా మాస్టర్స్ మాట్లాడుతూ న్యాయవాదులు వృత్తిలో భాగంగా మానసిక ఒత్తిడికి గురవుతారని, దీని వల్ల శారీరకంగా, మానసికంగా అనారోగ్యానికి గురవుతారన్నారు. యోగా ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు.